


-ఎమ్. రామకోటి

జోడు అరిగిపోయింది. చొక్కా చిరిగిపోయింది.

'నాలాగే ఉన్నావురా, బాబూ!' అనుకున్నాడు నాగరాజు.

ముద్దుల కూతురులా ఉంది. పట్టు పరికిణీ వేసుకుంది. పచ్చగా విరబూసిన కుందనం లాంటి చామంతి పూల జడ కుట్టుకుంది. పొట్టిగా బొద్దుగా గుమ్మటంలా ఉంది. మాస్టారి చిటికిన వేలు పట్టుకుని వేలాడుతూ, ఏదో కొని పెట్టమని మారాం చేస్తోంది.

"ఉండమ్మా ... అలాగే కొందాంలే... పెద్దవాళ్లతో మాట్లాడుతున్నానా? అల్లరి చెయ్యకూడదు మరి. కోపం తెప్పించకు" అని బుజ్జగించలేక, కసిరి కొట్టలేక విసుక్కుంటూ —

"అబ్బబ్బ! అది కొనూ, ఇది కొనూ... ప్రాణాలు తీసేస్తారనుకోండి. వీళ్లకేం తెలుసండీ మన అవస్థలూ?" అని కష్టసుఖాల్లోకి దిగేడు బడిపంతులు.

"అవును మరీ... పిల్లలు ... పాపం, వాళ్లకేం తెలుసు?" నీళ్లు మింగేడు నాగరాజు.

"నాన్నా!" అంటూ ముద్దుగా అలిగి చిందులేస్తూ బులాకీ బొమ్మలా తండ్రి చుట్టూ తిరుగుతూంది పాప.

వెర్రిగాలి వీస్తోంది. బుట్ట బొమ్మలా పాప పరికిణీ బుంగ తేరింది.

నాగరాజు మనస్సు కలుక్కుమంది.

నెల్లాళ్ల కిందట. . .

"నాన్నా, నాన్నా!" అని చనువుగా పక్కకి చేరింది పాప వంటింట్లో.

"ఏమమ్మా, ఏం?" అని ఒడిలో కూర్చోబెట్టుకుని ఒక ముద్ద తినిపించబోయేడు.

"ఊహుఁ." మూతి ముడుచుకుంది.

"మరేం కావాలమ్మా?"

"పండక్కి పావడా కుట్టించు, నాన్నా. ఉషా, రాధా వాళ్లంతా అప్పుడే కొనేసుకున్నారు" అంది ఒళ్లో చేరి.

గుండె గతుక్కుమంది. ఎందుకు అడిగేనా అని గింజుకుపోయాడు.

"అలాగేనమ్మా ... కొనిపెడతాలే" అనకుండా ఉండలేకపోయాడు.

వడ్డిస్తూ కళ్లలో కళ్లు కలిపి

చూసింది కమల. సూటిగా చూడలేక పోయాడు.

"చిన్న ముండకి అలా ఎందుకు ఆశ పెట్టేరూ?" వంటిల్లు చక్కబెట్టుకుని, పిల్లలందరూ పడుకున్నాక గదిలోకి వస్తూ అంది కమల.

"ఏం చేస్తాం? ఏడాది కో మారేనా కొత్త గుడ్డ కావాలా?" అన్నాడు నాగరాజు.

"దానికి కుట్టించేస్తే సరా? పాపం, రాముడూ, కిష్టిగాడూనో ... వాళ్ళే డవరూ?"

"ఏదో అప్పో సప్పో చేదాం మరి."

"ఉన్నవి చాలక ఇంకా ఎన్నని చేస్తారు? ఎంత తెచ్చినా చాల దీ గుండానికి."

"మరేం చెయ్యను, కమలా?" నల్లులు కుడుతున్నట్టు మంచంమీద అటూ ఇటూ చిరాగ్గా దొర్లాడు.

"బాధపడకండి. ఏదో చెప్పి మరి పించాలి గానీ ... అందరికీ అన్నీ ఉంటాయా చెప్పండీ?" అంటూ నుదురు మీద చెయ్యి వేసింది కమల.

అమృతం కురిపింది.

మెయిన్ రోడ్డు మీదికి వచ్చాడు నాగరాజు. పందెం వేసుకున్నట్టు సిటీ బస్సులు మీద పడి పోతూ దూసుకు పోతున్నాయి. తప్పించుకొని పేవుమెంటు ఎక్కిపోయేడు. ముందుకి వెళ్ళబోయేడు. కాలు కదలలేదు. తలుపు లేని పాతాళ ద్వారంలా డ్రెయినేజి కన్నం నోరు తెరుచుకుని మింగేస్తా నంటూంది. గటుక్కు మన్నాడు నాగరాజు. పండగ పూట కుళ్ళు కాలవలో పడిపోను. కాలో, చెయ్యో విరిగి ఏ సరదా లేకుండా మంచాన పడి పోను. గుండె గడగడలాడింది.

జేబులో టిక్కెట్లు ఫరఫరలాడేయి. బళ్ళూ, బస్సులూ వస్తున్నాయేమోనని వెనక్కి తిరిగి చూశాడు నాగరాజు. జివ్వు జివ్వుమని వీచింది చలిగాలి.

బుట్ట షెరాయి, మోకాళ్ళదాకా వదులు జుబ్బా. టోపీ మీద తురాయిలా పడగ విప్పిన తలపాగా, తోలు లాఠీ.

"సలామాలేకుం, నాగ్రాజూభాయీ! పండ్గా మీకూ! అచ్ఛాహై?" కాబూలీ వాడు పలకరించేడు.

గుండెలో రక్తం పేరుకుపోయింది. నరాలు కొయ్యబారిపోయేయి. పళ్ళ గిట్ట కరుచుకున్నాయి. నోరు వెళ్ళబెట్టుకుని ఒక్కమారు బొమ్మలా నిలబడిపోయేడు నాగరాజు.

"ఆఁ ఆఁ ... సలాం సలాం, ఖాన్ సాబ్!" అంటూ నీళ్ళు మింగేడు తెప్పరిల్లి.

జీతాల రోజు దాకానే ఈ ఆప్యాయత. ఆ రోజు మాత్రం యముడిలా కూర్చుంటాడు. చావు కన్నైనా కప్పొచ్చేమో కాని, వీడి కన్ను కప్పి తప్పించుకోలేడు.

ఇంటిల్లిపాదికీ బట్టలు తియ్యాలి. పబ్బం గడవాలి. వాడు తప్ప మరెవ డిస్తాడు? మూడు వందలు పుచ్చుకున్నాడు. ఆరు వందలకి నోటు రాసేడు. నెలయ్యేసరికి ముందుగా మూడు పదులు వడ్డీ కక్కాలి.

జేబులో టిక్కెట్లు బరువెక్కిపోయేయి. కుంగిపోయేడు నాగరాజు. కాళ్ళు పీకుతున్నాయి. తోటి గుమాస్తాలెవరేనా కనపడతారేమోనని రీడింగ్ రూమ్ దగ్గర ఆగి చూసేడు. అన్నీ మరిచిపోయి అందరూ పేకాడుకుంటున్నారు.

'ఏ చీకూ చింతా లేకుండా ఎలా ఉంటున్నారు వీళ్లంతా? ఎంత హాయిగా పేకాడుకుంటున్నారూ!' ఆశ్చర్య పోయేడు నాగరాజు.

'అప్పులు చేసి మరీ ఆడేస్తున్నారు... ఎంత ధీమా వీళ్ళకి!' అనుకుంటున్నాడు.



ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే

టూత్ పేస్ట్ - నీమ్

నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమేగాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణ చేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్ వారి ఉత్పత్తి




'అవును, అప్పు చేసేను. ఏం, చేస్తే ఏం? కుటుంబంకోసమే గదా? పెళ్లానికీ, పిల్లలకీ గుడ్డ ముక్కలు కొన్నాను. ఏం, జూదమాడి తందనా లాడేనా?' సమర్థించుకుంటున్నాడు.

'ఇంతకీ అప్పు లేనివా ళ్లెవరు? పండగ పూటా వెధవాలోచనలు! సుఖాన ఉన్న ప్రాణం దుఃఖాన్న పెట్టుకోవడం. వెధవప్పు! ఎంత? మూడొందలు. ఉండిపోతుందా? కో-ఆపరేటివ్ లోన్ రాగానే తీర్చేస్తాను.' నిబ్బరపడ్డాడు నాగరాజు.

కొత్త బట్టలు కట్టుకుని పిల్లలు కళకళలాడతారు. కమల కొత్త చీర కట్టుకుంటుంది. ఆ కళ్లలో కోటి దివ్వెలు వెలిగిపోతాయి. ఆ మొహంలో చిరునవ్వు చిందులాడుతుంది. ఆ బుగ్గల మీద గులాబీ మొగ్గలు చిగురిస్తాయి. అదే పండగ! పెద్ద పండగ! అదే చాలు.

"కమలా! కమలా!" హడావిడిగా గుమ్మంలో అడుగు పెట్టేడు నాగ రాజు.

పిల్లలంతా కూడి జానా పట్టు ఆడుకుంటున్నారు.

"నాన్నా, నాన్నా ..." చెంగుచెంగుమని దూకుతూ వచ్చింది పాప పరికిణీ ఎత్తిపట్టుకుని. "ఏమమ్మా?" అంటూ ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు నాగ రాజు.

"నా పరికిణీ బాగుందా?"

"ఓ ... అప్పుడే తొడిగేసుకున్నావేమిటే? అబ్బో! చాలా బాగుందమ్మా" అన్నాడు.

చవకబారు రేషను సిల్కు గుడ్డ వెలవెలపోతూంది. దానికే మురిసిపోతూంది వెర్రి ముండ.

"మీ అమ్మేదీ? కమలా! ఏం చేస్తున్నావూ?" అంటూ పాపని దించేశాడు.

"అబ్బబ్బ! ... ఏమిటండీ? ఇదిగో, వస్తున్నా. ఏమొచ్చిందీ?" చేతులు దులుపుకుంటూ వంటింట్లోంచి వచ్చింది కమల.

మొహం జిడ్డోడుతూంది. పిండి రేగి జుత్తు నెరిసిపోతూంది.

"ఇంకా చీర కట్టుకోలేదూ?" అన్నాడు కమల మొహంలోకి చూస్తూ.

"ఎక్కడ పని అక్కడే ఉంది... అప్పుడే ఎలా అవుతుంది నాకూ?"

"పండగపూటా ఏవి ఎటా పనీ?"

"బాగుందండీ మీ వరసా ... పండగ నాడు కాకపోతే మరెప్పుడండీ పనీ? పిల్లలు జంతికలుచేసిపెట్టమంటేనూ..." పిండి చేతులు నలుపుకుంది కమల.

"అఘోరించేరు... వెధవ పురమాయింపులూ వీళ్లూను!" విసుక్కున్నాడు నాగరాజు.

"బాగుందండీ ... మరోనాడు వాళ్లడుగుతారా, మనం పెట్టగలమా?" నవ్వింది కమల.

నవ్వినప్పుడు బుగ్గల మధ్య లోతులు పడేవి. అవి ఇప్పుడు సుడులు తిరగలేదు. అసలు బుగ్గలే లేవు. కరిగి పోయాయి.

"ఏమిటండీ ... ఊఁ అలా చూస్తున్నారూ? ఏముంది నా మొహంలో?" అంది నవ్వుతూ.

నవ్వుతూంది కమల. ఆ నవ్వులో వెలుగు లేదు. ఆ కళ్లలో తళుకు రవ్వలు లేవు.

"అహఁ ఏం లేదూ" అని తడబడి, "వేగం తెములుచ్చుకుని చీర కట్టుకో. టిక్కెట్లు తెచ్చేను. సినిమాకి వెళదాం" అన్నాడు టిక్కెట్లు అందిస్తూ.

"ఖర్చులు చూస్తుంటే గుడ్లెక్కొస్తున్నాయి, ఇప్పు డెందుకు తెచ్చేరూ? కడుపు నిండనా, కాలు నిండనా? సినిమా చూడకపోతే ఏం?" అని బరువుగా టిక్కెట్లు అందుకుని—"చద్దీ బూర్లు చేసేను. భోజనానికి రండి. వడ్డించేస్తాను" అంటూ వంటింట్లోకి దారి తీసింది కమల.

టిక్కెట్లు తెచ్చినందుకు సరదాపడి పోలేదు. సినిమాకి వెళుతున్నందుకు సంబరపడిపోలేదు. కుప్పకూలిపోయేడు నాగరాజు. రెప్ప లార్చకుండా అలా చూస్తూ ఉండిపోయేడు.

జారిపోతున్న వేలు ముడి మీద తెల్ల జీరలు పాయలు కడుతున్నాయి. చెవి సందున వంపులు సాగిపోయి చింపిరి చింపిరిగా రేగిపోయాయి. చెంపల దిగువ నూగు రాలిపోయింది. నునుపు మొద్దు బారింది.

లేమి ఆవులించిందా? కాలం గుటకేసిందా?

తన కంటి ముందు విరబూసిన మొగ్గ కమల...తన కమల...వడిలిపోయి రెక్కలు రాల్చేస్తూంది.

విలవిలలాడిపోయేడు నాగరాజు.

భుక్తాయాసంలో చిన్న కునుకు తీస్తున్నాడు. ఏదో అలికిడై కళ్లు తెరిచాడు. కొత్త చీరలో కాఫీ గ్లాసు పట్టుకుని తచ్చాడుతూంది కమల.

"కమలా!" అలా చూస్తూ ఉండిపోయాడు నాగరాజు.

"అబ్బ! ఏమిటండీ ... ఏమి టా చూపులూ? ఇందాకటి నుంచీ చూస్తున్నాను మీ వాలకం" అంటూ కాఫీ గ్లాసు అందిస్తూ పక్కన కూర్చుంది.

"ఏం లేదు, కమలా. నువ్వా ... నువ్వా ఆ కమలేనా అని?" అన్నాడు నాగరాజు వేడి కాఫీ ఊదుకుంటూ.

"ఏ కమలండోయ్!" అంది కళ్లు పెద్దవి చేస్తూ.

"ఎవరూ కాదులే!"

"మరెవరూ? !"

"నువ్వే." నవ్వేశాడు నాగరాజు.

"నేనా! ... నేను నేనుగాకపోతే" అని నాన్చి, "బాగుంది వరస. కల గన్నారా?" అంది వెటకారంగా.

"ఆవేళ ... పెళ్లయిన కొత్తలో!" వెలితి చూపులు చూస్తున్నాడు నాగ రాజు.

"ఆఁ!. కొత్తలో ... నిజంగా కల గన్నా రన్న మాట!"

"మీ ఊళ్లో సినిమా కెళ్లేం. జ్ఞాపకం ఉందా?"

"ఎందుకు లేదూ? మీ రాడిన భాగోతమూ జ్ఞాపకం ఉంది." ముసిముసిగా నవ్వింది కమల.

"మళ్లీ ఈరోజు వెళుతున్నాం."

"అయితే నే రాను బాబోయ్ మీరే వెళ్లండి."

"ఏం?"

"అల్లరల్లరీ ... చూడనిస్తారా ఏమన్నానా?" అంది కళ్లతో నవ్వి, కాఫీ గ్లాసు అందుకుంటూ.

"ఓ లదా!" అన్నాడు నవ్వేస్తూ.

"మా రే." మూతి తిప్పుకుంది కమల.

"అది కాదు, కమలా?"

"మరేది?"

"ఆ ఉంగరాల జుత్తూ, బుగ్గల మీద గులాబీ మొగ్గలూ ఏమైపోయేయి, కమలా?" జాలిగా చూసి దగ్గరకు లాక్కున్నాడు నాగరాజు.

"బాగుంది బాగుంది ... ఇంకా చిన్న బాలా కుమారినా? పిల్ల లెదిగొస్తున్నారు" అంటూ — "అబ్బ! వదలండీ . . . వేళా లేదు, పాళా లేదు. ఏమిటిదీ . . . ఉష్! పిల్లలు చూస్తారు" అంటూ జారిపోతున్న పైట అదుముకుంటూ, వదిలించుకుని చివాలున మంచం మీంచి లేచిపోయింది కమల.

"అంత వయసైపోయిందా, కమలా?"

"లేకపోతే ... దాచేసుకున్నానా?" అంటూ గుమ్మం ముందు అటూ ఇటూ తొంగి చూసింది పిల్లలున్నారేమోనని.

వయసూ మారలేదు. సొగసూ మారలేదు. టింగులు మింగేస్తున్నాయి. బతుకు చప్పరించేస్తూంది.

వలక పడినట్టు కళ్లొత్తుకుంది కమల.

"నే వెళుతున్నానమ్మా" అంటూ వెళ్లిపోతూ ఆగింది పాప.

"జాగర్త సుమా. అందరూ జట్టుగా కూచోండి ... తప్పిపోతారు." తల నిమిరి పంపిస్తూంది కమల.

"ఎక్కడికి? ఇంత ఎండలో?" అన్నాడు నాగరాజు.

"సినిమాకి. చిన్న టిక్కెట్లు ఇప్పటి నుంచే క్యూలో ఉంటేగాని దొరకవు. సాయంత్రం ఆటకి ఇప్పుడే పోతున్నారు, పాపం" అంది కమల.

"ఒక్కర్తే!"

"అబ్బే, వాళ్ల క్లాసు పిల్లలంతా పోతున్నారు."

"డబ్బో?"

"అది కూడబెట్టుకుంది. ఎవళ్లైపైసలేగా?"

"దేనికి?"

"కొత్తదానికే" అంది కమల.

ఉగ్రుడైపోయి, తోక తొక్కిన తాచులా లేచి పోయేడు నాగరాజు.

"దగ్గరుండి మరీ పంపుతున్నావా? నీకేం బుద్ధుందా? మతీ సుతీ ఏమైనా ఉందా?" పిడుగులా పడిపోతున్నాడు.

"ఏం? ఏమండీ?" తెల్లబోతూంది కమల.

"నానా నరకం ... కుళ్లు కాలవ గట్టు మీద ... ఎండలో మాడుతూ... బికారి గుంట లాగ!" మాటలు తడబడి కంపరమెత్తిపోతున్నాడు నాగరాజు.

"పిల్లలు ... వాళ్లకేమిటండీ ఎండా వానానూ? అయినా మీరూ నించున్నారుగా?" అంది అమాయకంగా.

"నేనా!" అని ఒక్కమారు తడుముకుని, "ఆఁ నించున్నాను ... నించున్నానే ... దానికీ, దీనికీ పోలికా? చలవ రాళ్ల గచ్చులూ, నీడపట్లూ, పెద్ద టిక్కెట్లూ ... మరుగు దొడ్లూ నించో లేదు." ఉడుక్కున్నాడు నాగరాజు.

"పోనీలెండి. వాళ్లకేం నామోషీ కాదు. పెద్దవాళ్లే నించుంటున్నారు" అంది కమల.

"ఈవేళే వెళ్లాలా?" ఉరిమేడు ఊరుకోలేక.

"బాగుంది చోద్యం. పండగని తోటి పిల్లలంతా పోతుంటే అది ఊరుకోగలదా?" వూసుకొచ్చింది.

"మరోదానికి పోరాదూ? హాయిగా టిక్కెట్లు దొరుకుతాయి!"

"దాని బాధేదో అది పడుతుంది. మీకెందుకూ మధ్య? ఊఁ ఇదైపోతున్నారూ? కొత్త సినిమా అని ఊరూ వాడా ఏకమై చూస్తుంటే దాన్ని మరో దానికి పొమ్మంటారా?" సాగదీసింది కమల.

"మరో రోజు వెళుతుంది ... ఈవేళే చూడకపోతే ఏం? ఊరొదిలి పారిపోదుగా సినిమా?" కమల వేపు తిరిగి కళ్లెర్రజేశాడు నాగరాజు.

"పారిపోదు. మరి మనమూ ఈవేళే వెళుతున్నాంగా?" అంది కమల పెడిమని.

"అదే నా బాధ." నెత్తి కొట్టుకున్నాడు.

"ఏం జరిగిందనీ ... పండగపూట నెత్తి బాదుకోవడం?" పోట్లో కొంగు కుక్కుకుంటూ నిష్ఠూరంగా చూసింది కమల.

"మట్టి బుర్ర ... ఎలా చెప్పడం?"

"అందుకే తిట్లూ, శాపాలూ తినడం. ఏం కొంప మునిగిపోతుందండీ అదీ సినిమాకొస్తే?"

"అబ్బబ్బ!"

"ఎందు కా చిందులూ? తేరగా దొరికేం మీ విసుగులకీ, కసుగులకీ!"

"నువ్వే దానికి కొమ్ముకాస్తున్నావు... నీ అలుసు చూసుకునే అన్నిటికీ సిద్ధమవుతోంది. ఛీ ఛీ! నీకు బుద్ధిలేదు." జుత్తు పీక్కున్నాడు నాగరాజు.

"ఎందుకొచ్చిన పిచ్చికోపమండీ! కాని పనేం చేసేసనీ?" తిరగబడింది కమల.

"ఏం చేసేవా? నాకు తద్దినం పెడుతున్నావు. నాకు తలవంపులు తెస్తున్నావు." గొంతు చించుకుని అరిచేడు నాగరాజు.

"నేనా! ఏం మాటలండీ?" కళ్ల నీళ్లు పెట్టుకుంది కమల.

"ఆఁ నువ్వే. అదీ, మనం ఈవేళే వెళితే ..."

"వెళితే? !"

"అది గోతిలోనూ, మనం బాల్కనీలోనూ ... ఇంటర్వెల్లో 'అమ్మా' అని నీ దగ్గరికి రాదూ?"

"మన పిల్ల మన దగ్గరికి రాదూ? వస్తే ఏం?"

"సిగ్గు సిగ్గు ... ఎవరేనా చూస్తే!" అన్నాడు నాగరాజు గింజుకుపోతూ.

"సిగ్గా! మన పిల్ల మనదగ్గరి కొస్తే సిగ్గా! ఇదేం విడ్డూరమండీ!" దవడలు నొక్కుకుంది కమల.

"ఛీ నోర్ముయ్!" చెయ్యెత్తేడు నాగరాజు.

"కొట్టండి, కొట్టండి ... అనువుగా దొరికేం ... ఇంత చదువూ చదివి మరేం చేస్తారు?" అంది కమల ఏడుస్తూ.

సిగ్గుపడిపోయేడు నాగరాజు. పాప బిక్కచచ్చిపోయింది. మగ పిల్లలు పటాపంచలై పోయి మూల మూలలా నక్కిపోయేరు.

"ఛీ ఛీ! బొత్తిగా ఇంగితం లేదు. ఏమీ తెలియదు. మొద్దు. నా ఖర్మ! నువ్వూ, అదీ తగలడండి" అంటూ గావుకేక లేసుకుంటూ గదిలోంచి బయటికి వచ్చేసేడు.

"దాన్ని తీసుకుని మీరే వెళ్లండి. నే రాను. దిక్కుమాలిన సినిమా చూడకపోతే నాకేం లోటు లేదు" అంది కమల పౌరుషంగా.

"నేను వెళ్లను!" పేం(డించుకున్నాడు నాగరాజు.

"ఆఁ నేనే సిద్ధంగా ఉన్నాను." చేతులు తిప్పుతూ మూతి ముడుచుకుంది కమల.

"ఎవరూ వెళ్లక్కర్లేదు. ఆ వెధవ టిక్కెట్లు చించి పారేయ్" అంటూ పెరట్లోకి దూసుకుపోతూ, తల్లి ఒడిలో బిక్కుబిక్కుమంటూ బెదిరిపోతున్న పాపని చూసేడు.

వెక్కుతూంది పాప. దిద్దుకున్న కళ్ల కాటుక కరిగిపోయి మొహమంతా పులుముకుపోతూంది. తండ్రి మొహం చూసి హడలిపోతూ పరికిణీతో కళ్లు తుడుచుకుంటూంది.

"కొత్తబట్టలే, యాభ్రాసి పీనుగా... అవీ తగలెట్టకు" అని కసురుకుంటూ, "అయినా ఈ గుంట ముండే... భయమూ, భక్తీ లేదు ... ముద్దిస్తుంటే ముక్కెట్టుకుంటోంది. అన్నిటికీ అడ్డు. ఎక్కడికేనా బయలుదేరితే చాలు, ఉమారుమని ఏడుపు. ముందు నీకు తగిలే ... నువ్వూ ... నువ్వూ..." అని విసురుగా రెక్క పట్టుకుని ఈసడించి ఈడ్చేసి చెయ్యెత్తి బాదెయ్యబోయేడు.

రెండు చేతులా అడ్డు పెట్టుకుని కెవ్వుమంది పాప. సుడిగాలిలా అడ్డుగా మధ్యకి దూసుకొచ్చింది కమల. నాగరాజు చెయ్యి కమల చెంప మీద ఛెళ్లుమంది.

"అబ్బ! ఉస్సు!" చెంప పట్టుకుంది కమల.

పసరు మొగ్గల గుత్తిలా తల్లి చుట్టూ మూగిపోయేరు పిల్లలు.

"కమలా!" అరిచాడు నాగరాజు.

"దానిమీద చెయ్యి పడితే నా మీద ఒట్టే!"

"కమలా!" దిగజారిపోయేడు నాగరాజు.

"కడుపునిండా తిండి ఎలాగా పెట్టలేం ... పండగపూటా ఇలా పెడతారు?" భోరుమంది కమల.

"కమలా...కమలా!నువ్వెందు కొచ్చేవు,



ఎలనాగ

చిత్రం— పి. ఆగాచార్య
( కరీంనగర్ )

కమలా?" డిపోతూ పెరట్లోకి వెళ్లిపోయేడు గరాజు.

కాలుగాలిన పిల్లిలా జాజి పందిరి చుట్టూ తిరుగుతూ రెమ్మలు దూసేస్తున్నాడు.

ఎదుగూ బొదుగూ లేని గొర్రెతోక సంపాదన. తోడేళ్లలా గుర్రుపెట్టే కాబూలీవాళ్లు. ఛీ ఛీ! వెధవ బతుకు. గాలి మేసి బతకాలి. ఒక్కగా నొక్క పిల్ల. తనతోబాటు సినిమాకి తీసుకెళ్లలేడు. కట్టుకున్న ఇల్లాలి మీద చెయ్యి చేసుకున్నాడు. పాపిష్ఠి బతుకు! పిడికిళ్లు బిగించి పందిరికేసి కొట్టుకుంటూ ఊపేస్తున్నాడు. జ్వరం వచ్చినట్టు వణికిపోతూ గాలిలో బుసలు కొడుతున్నాడు నాగరాజు.

జలదరిస్తూంది జాజి పందిర.

"నాన్నా ... నాన్నా!" బెక్కి బెక్కి ఏడుస్తూ ముందు నిలబడింది పాప.

తెల్లబోయి చూసేడు నాగరాజు.

"నాన్నా... నువ్వూ, అమ్మా వెళ్ళండి, నాన్నా ... మరెప్పుడూ ఏడవను, నాన్నా. ఇంకెప్పుడూ మీతో రాను ..." ఎక్కిళ్ళొస్తున్నాయి పాపకి.

"పాపా! అమ్మా ... " బావురుమన్నాడు నాగరాజు.

గుండె తరుక్కుపోతూంది. దుఃఖం పట్టలేక పోయేడు.

"అమ్మా, పాపా! మరోనాడు అందరం వెళదాంలే, అమ్మా" అని తెళ్ళుకొస్తున్న ఏడుపుని ( పెట్టుకుని ఆపుకుంటూ, పాపని ఎత్తుకుని ఒళ్ళంతా ముద్దులు పెట్టేసుకున్నాడు.

"వద్దు, నాన్నా! మరెప్పుడూ మీతో వస్తానని ఏడవను. మీరు వెళ్ళండి, నాన్నా.." వెక్కివెక్కి ఏడుస్తూ దణ్ణం పెడుతూంది పాప.

వెకిలినవ్వు నవ్వుతూంది ఆకతాయి చలి. నీరై పోయేడు నాగరాజు. కడుపు చెరువై పోతూంది.

"దౌర్భాగ్యుణ్ణమ్మా! మాతోబాటు నిన్ను పక్కన కూచోబెట్టుకోలేని దౌర్భాగ్యుణ్ణి" అని కన్న కూతురితో చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతూ, "నువ్వెళ్ళమ్మా ... అమ్మ దగ్గరికి వెళ్ళు" అని పాపను దించేసి అటు తిరిగిపోయి మొహం చాటేసుకున్నాడు.

పందిరకి అనుకుని ఆకులూ, మొగ్గలూ తెంపి పోగులెడుతున్నాడు.

"చూడండి!"

"కమలా!" కళ్ళ నీళ్ళు తిరుగుతున్నాయి.

"ఛ ఛ! ఏమిటండీ చిన్న పిల్లాడిలా!" కొత్తచీర కొంగుతో కళ్ళు తుడిచింది కమల.

"నిర్భాగ్యుణ్ణి, కమలా!" జాజి తీగ పట్టుకుని లాగుతున్నాడు.

"పసరు మొగ్గలు తుంచేస్తున్నారు."

ఉలికిపడ్డాడు నాగరాజు. దూసి పారేసిన ఆకులూ, మొగ్గలూ పందిరచుట్టూ చిందరవందరగా పడి ఉన్నాయి. చేతులు ముళ్ళ కంపల్లా కనిపించేయి.

"బాగా చెప్పేవు, కమలా! పసరు మొగ్గలు. పసివాళ్ళ కోరికలు. మొగ్గల్లోనే తుంచేస్తున్నాను." కమల మొహం చూడలేకపోయేడు నాగరాజు.

"అయ్యయ్యో! అది కాదండీ నే




ననేది..." అని కలవలపడి వొచ్చుకుంటూ, "ప్రతి చిన్న విషయానికి అంత బాధపడిపోతే ఎలా చెప్పండి?" అని జాలిగా నవ్వుతూ సముదాయించబోయింది కమల.

"చిన్న విషయమా, కమలా? !"

"ఏమిటండీ ... మీరు మరీనూ! గోరంతల్ని కొండంతలు చేసుకుని ఊరికే ఇదై పోతున్నారు. ఇదిగో, చూడండి!"

"ఏమిటి, కమలా?"

"ఈ దిక్కుమాలిన టిక్కెట్లే... ఇవే ఇంత చిచ్చుపెట్టేయి. తీసుకెళ్ళి... నా మాట వినండి... హాలు దగ్గర అమ్మెయ్యండి ... కళ్ళ కద్దుకుని కొనుక్కుంటారు" అంటూ టిక్కెట్లు చేతిలో పెట్టింది కమల.

"కమలా!" అని దిగాలుపడి, "పోనీ... నువ్వూ, పాపా వెళ్ళిరారాదూ? చాలా బాగుందిట" అన్నాడు తల వంచుకుని.

"మన బతుకే సినిమా ... అక్కడికెళ్ళి మళ్ళీ చూడాలా? పైపై పోతోంది వేగం వెళ్ళిరండి ... ఈలోగా పిల్లలూ, నేనూ సరదాగా పేకాడుకుంటాం" ఎండిపోయి పెళుసుబారిన తీగలా గంగవిర్చింది కమల.

గుడిసెల వార మురికి నీరు ఎడతెరిపిలేక పారుతూంది. ఎదురుగా ఐశ్వర్యం పాలు పొంగినట్లు పొర్లాడుతూంది. టిక్కెట్లు పట్టుకుని మరో దారి లేక మందకొడిగా రహదారి మధ్యలో పడి నలిగి దొర్లిపోతున్నాడు నాగరాజు.

పాపని దగ్గరకు తీసుకుని తల నిమురుతూ వెలితి చూపులు చూస్తూంది కమల. వెకిలి చలి మూలుగుల్లోంచి దొరికేస్తూంది. వెర్రిగాలి వీస్తూంది.

జడుసుకుంటూంది జాజి పందిర. ✱